అవగాహన లోపం.. అర్హులకు శాపం

- ఎంపీడీవో కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



దరఖాస్తులు ఇచ్చేందుకు బారులు తీరిన జనాలు



దరఖాస్తులతో బయట వేచిచూస్తున్న మహిళలు

నార్నూర్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన గృహజ్యోతి పథకంలో భాగంగా రూ.500కు వంటగ్యాస్ సిలిండర్ చాలామంది అర్హులైన లబ్ధిదారులకు అందడం లేదు. పథకానికి దరఖాస్తు చేసే సమయంలో ఆపరేటర్లు చేసిన తప్పిదాలతో ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి దాపురించింది. మరోవైపు ఆహార భద్రత కార్డు కలిగిన ప్రతిఒక్కరూ సంక్షేమ పథకాలకు అర్హులేనని ప్రభుత్వం చెబుతుంది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. అయితే ప్రజాపాలన సేవా కేంద్రాల్లో కేవలం సవరణకు మాత్రమే అవకాశం ఇచ్చారు. గతంలో దరఖాస్తు చేసుకున్నా ఆన్‌లైన్‌లో 'నాట్ అప్లై' అని ఉంటే సవరణ చేసుకోవడానికి వీలు లేకుండా పోయింది.

హడావుడి.... ఆపరేటర్ల తప్పిదంతో...

ప్రజా పాలన సేవా కేంద్రాల్లో కొత్తగా దరఖాస్తు చేసుకోవడానికి వీలు లేదు. గతంలో దరఖాస్తు చేసుకున్న వారికి నాట్ అప్లై అని ఉంటే పథకం వర్తించే అవకాశం లేదు. దీంతో కొత్త, పాత వారికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దరఖాస్తుల స్వీకరణ సమయంలో అధికారులు స్పష్టంగా చెప్పకపోవడం, ఆపరేటర్ల తప్పిదాలతో ఇక్కట్లు తప్పడం లేదని అర్హులైన లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం సమయం తక్కువ ఇవ్వడంతో పై అధికారుల ఒత్తిడి వలన ఆపరేటర్లు హడావుడిగా ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేశారు. ఈక్రమంలో జరిగిన పొరపాట్లతో చాలామంది అర్హులు ఈ పథకానికి దూరంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. మండల కేంద్రాల్లోని ఎంపీడీవో కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రజా పాలన సేవా కేంద్రాల్లో సవరణ కోసం వచ్చే వారి సమస్యలను గుర్తించి ఆన్‌లైన్ చేస్తే పరిష్కారం దొరికే అవకాశం ఉంది.

కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ

ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రంలో ఒక జూనియర్ అసిస్టెంట్‌తో పాటు ఒక కంప్యూటర్ ఆపరేటర్‌కు బాధ్యతలు అప్పగించారు. కానీ కొన్ని రోజులుగా ఎంపీడీవో కార్యాలయంలో పనిచేసే ఆపరేటర్ రాకపోవడంతో ప్రజాపాలన సేవా కేంద్రంలో గృహజ్యోతి పథకానికి సంబంధించిన దరఖాస్తులను సవరించే నాధుడే కరువయ్యారు. జూనియర్ అసిస్టెంట్ రెగ్యులర్‌గా వస్తున్నప్పటికీ ఆపరేటర్ అందుబాటులో లేకపోవడంతో వివిధ గ్రామాల నుంచి సవరణకోసం వస్తున్న ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. ప్రజలకు అవగాహన లేకపోవడంతో రేషన్‌కార్డు ఆన్‌లైన్ నంబర్, గ్యాస్ ఆన్‌లైన్ నంబర్‌కోసం పలుమార్లు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పథకానికి కావాల్సిన ధ్రువీకరణ పత్రాలపై అవగాహన కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశాం

గృహజ్యోతి దరఖాస్తుదారుల కోసం కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశాం. మొదట్లో కొంత అవగాహన లోపం జరిగింది. ప్రస్తుతం దరఖాస్తుదారులకు అవగాహన కల్పించి అవసరమైన ధ్రువీకరణ పత్రాలను తీసుకురావాలని సూచిస్తున్నాం. గ్యాస్, రేషన్ కార్డు నంబర్ల దగ్గరే కొంత సమస్య వస్తోంది. అవగాహన కల్పించి దరఖాస్తులను సవరిస్తున్నాం.

– జవహర్, ఎంపీడీవో, నార్నూర్

కేటీఆర్‌కు ఘన స్వాగతం



స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే, కార్యకర్తలు

నేరడిగొండ: బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మంగళవారం రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తో పాటు ఉమ్మడి జిల్లా నాయకులు ఘన స్వాగతం పలికారు. పార్లమెంట్ ఎన్నికల బూత్ స్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొనేందుకు ఆదిలాబాద్ వెళ్తున్న కేటీఆర్‌ను భారీ గజమాలతో సత్కరించారు. అనంతరం ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నాయకులు, కార్యకర్తలతో కలిసి నృత్యం చేశారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ బీఆర్‌ఎస్ నాయకుడు జాన్సన్ నాయక్, బోథ్ జెడ్పీటీసీ సంధ్యారాణి, బోథ్, నేరడిగొండ ఎంపీపీలు తుల శ్రీనివాస్, రాథోడ్ సజన్, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మండలంలోని ముఖరా(కె) రోడ్డు వద్ద ఘన స్వాగతం పలికారు. సర్పంచ్ గాడ్గే మీనాక్షి, ఎంపీటీసీ గాడ్గే సుభాష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్నేహితురాలికి బాసటగా నిలిచిన మిత్రులు



ఆర్థికసాయం అందిస్తున్న స్నేహితులు

ఆదిలాబాద్‌టౌన్: స్నేహితురాలు కష్టకాలంలో ఉందని తెలుసుకున్న మిత్రులు తమకు తోచిన సహాయం అందించేందుకు ముందుకొచ్చారు. నార్నూర్ మండలంలోని తడిహత్నూర్ గ్రామానికి చెందిన దివ్యాంగురాలైన అనురాధ కాలుకు ఇటీవల రిమ్స్‌లో శస్త్ర చికిత్స చేయించారు. మరో కాలుకు త్వరలో చికిత్స జరగనుంది. విషయం తెలుసుకున్న తడిహత్నూర్ జెడ్పీఎస్‌ఎస్ 2005–06 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు రూ.10వేల ఆర్థికసాయం అందించి ఆమెకు అండగా నిలిచారు. కార్యక్రమంలో గణేశ్, గోవింద్, అశ్విన్, రహీమ్, జుబేర్, ప్రశాంత్, సరిత, విద్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



పరామర్శిస్తున్న ఆత్రం సుగుణ

నేరడిగొండ: మండలంలోని చించోలిలో కాంగ్రెస్ నాయకుడు ఆత్రం భాస్కర్ సోదరుడు ఆత్రం రవీందర్ ఇటీవల అనారోగ్యంతో, గాంధారిలో ఆత్రం జైవంత్ రావ్ తనయుడు ఆత్రం మహేష్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వసంత్ రావు, నారాయణరెడ్డి, తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

నీటి సమస్య తలెత్తకుండా చూడాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎల్‌పీవో

నేరడిగొండ:వేసవిలో గ్రామీణ ప్రాంత ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధులపై ఉందని డీఎల్‌పీవో ఫణీందర్ అన్నారు. మంగళవారం మండలంలోని వడూర్‌లో పర్యటించారు. బోర్ల వద్ద తాగునీటిని తీసుకెళ్తున్న ప్రజలతో మాట్లాడారు. బోరు నీటిని తీసుకెళ్లేటప్పుడు అందరూ ఒకేసారి వచ్చి నీటిని తీసుకెళ్లాలని, నీరు వృథా చేయకూడదని సూచించారు. ఆయన వెంట ఎంపీవో లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి నర్సారెడ్డి, తదితరులు ఉన్నారు.

రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టాలి



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజ్‌వీర్

నేరడిగొండ: ఉపాధిహామీ పథకంలో రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టాలని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. మంగళవారం రోల్‌మామడలో చేపడుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. పంట పొలాల్లో రాళ్ల కట్టలు వేస్తున్న కూలీల ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనులను ఉదయం వేళల్లో చేపట్టాలని సూచించారు. ఎండ తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి హారిక, టీఏ సంతోష్, తదితరులు ఉన్నారు.

సోయాపంట పరిశీలన



పంటను పరిశీలిస్తున్న ఏఈవో, రైతులు

తాంసి: మండలంలోని వడ్డాడిలో యాసంగి సీజన్‌లో సాగుచేసిన సోయాపంటను ఏఈవో యోగిరాజ్ మంగళవారం పరిశీలించారు. ప్రస్తుతం పంట కాతదశలో ఉండగా గింజలు సన్నగా ఉన్నాయి. దీంతో దిగుబడి తక్కువగా వచ్చే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయాధికారులకు సమాచారం అందించడంతో కంపెనీ అధికారి నగేష్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వివరాలు సేకరించి ఏవోకు నివేదించారు. పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

చాంబర్ ఆఫ్ కామర్స్ మండల అధ్యక్షుల ఎన్నిక

ఆదిలాబాద్‌టౌన్: చాంబర్ ఆఫ్ కామర్స్ మండలాల అధ్యక్షులను నియమించినట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కమల్ కిషోర్, గండ్రత్ సంతోష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నార్నూర్, జైనూర్ మండల అధ్యక్షులుగా జ్ఞానోబా పురస్కార్, బేల, జైనథ్ మండల అధ్యక్షులుగా ప్రణయ్ కుమార్‌ను నియమించినట్లు పేర్కొన్నారు. సంఘం బలోపేతం కోసం తమవంతు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

గుండెపోటుతో గ్రామపటేల్ మృతి

తాంసి: మండలంలోని అంబుగాం గ్రామపటేల్ ఆత్రం మల్కు (61) మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. సాయంత్రం గుండెపోటు రావడంతో ఆస్పత్రికి తరలించే క్రమంలో మృతిచెందాడు. అంబుగాం గిరిజన గ్రామానికి పెద్దదిక్కుగా ఉన్న పటేల్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఎంపీ అభ్యర్థి సుగుణకు సన్మానం

నేరడిగొండ: మండలంలోని కుమారి గ్రామానికి మంగళవారం చేరుకున్న కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను గ్రామస్తులు, ఆ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. మొట్టమొదటిసారిగా గ్రామానికి వచ్చిన సందర్భంగా సీనియర్ నాయకులు రామలక్ష్మణ్ గౌడ్, మాజీ ఉప సర్పంచ్ నరేష్‌రెడ్డి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిలకయ్య, లస్మన్న, భీమ్‌రాజుగౌడ్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

బెంచీల ఏర్పాటు

నేరడిగొండ(బోథ్): బోథ్ మండల కేంద్రంలోని నాగభూషణం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కిషోర్ కుమార్ తల్లిదండ్రులు (సుందరమ్మ, నాగభూషణం) జ్ఞాపకార్థం గురుకుల పాఠశాల ఎదుట బెంచీలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు స్వర్ణలత, కిషోర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'సీఎం వ్యాఖ్యలు తీవ్రంగా ఖండిస్తున్నాం'



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు మల్లేశ్ మాదిగ

ఎదులాపురం: నారాయణపేట సభలో సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మార్పీఎస్ ఉద్యమం, మంద కృష్ణ మాదిగపై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేశ్ మాదిగ అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాదిగల ఆవేదన పట్టించుకోకుండా సామాజిక న్యాయాన్ని విస్మరించి, రిజర్వేషన్ అవకాశాలను తుంగలో తొక్కి అధిక జనాభా దామాషా కలిగిన మాదిగలను అణిచివేస్తున్నారన్నారు. తన కుర్చీని కాపాడుకునేందుకు ఎస్సీలో ఒకే సామాజిక వర్గానికి వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను చిత్తుగా ఓడిస్తామన్నారు. ఇప్పటికైనా ఇలాంటి వ్యాఖ్యలను మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పులేటి శ్రీను మాదిగ, సందీప్ మాదిగ, అజయ్, గణేశ్ రాజు పాల్గొన్నారు.

'ఆశాలతో డబ్బాలు మోయించడం సరికాదు'



వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

ఎదులాపురం: ఆశాలతో స్పూటం డబ్బాలు మోయించడం సరికాదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న అన్నారు. ఈ విషయమై మంగళవారం తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) నాయకులతో కలిసి జిల్లా క్షయ నియంత్రణ కేంద్రంలోని టీబీ విభాగం వైద్య అధికారిని డాక్టర్ సాయిప్రియకు వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్పూటం బాక్స్‌ల గురించి టార్గెట్ విధించి ఆశాలను ఇబ్బంది పెడుతున్నారని, టార్గెట్ పూర్తి చేయకుంటే పారితోషికాలు కట్ చేస్తామనడాన్ని తప్పుబట్టారు. ఎంత మోటివేషన్ చేసినప్పటికీ పరీక్షల కోసం స్పూటం ఇచ్చేందుకు ప్రజలు ముందుకు రావడం లేదన్నారు. మూడేళ్ల నుంచి స్పూటం బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే చెల్లించాలన్నారు. ఇప్పటికైనా టార్గెట్‌లు విధించడం మానుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడతామన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు అగ్గిమల్ల స్వామి, ఆశా యూనియన్ జిల్లా కార్యదర్శి సుజాత, ఆశాలు మాధవి, అరుణ, గంగమ్మ, కవిత, జామున, పద్మ పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆలోచనలు ఆచరించాలి



విరాళం అందజేస్తున్న భీంరావ్

ఆదిలాబాద్‌రూరల్: డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచనలను ఆచరించాలని లుంబిని బుద్ధ విహార్ కమిటీ సభ్యులు బోరేకార్ భీంరావ్ అన్నారు. మండలంలోని పిప్పల్‌ధరిలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు మంగళవారం తనవంతుగా రూ.40 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల వ్యవస్థను దూరం చేయడమే అంబేద్కర్ ఆశయమని, ఆయన స్ఫూర్తితో అందరం కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బోరేకర్ సోమన్న, బోరేకర్ విశాఖ, భగత్ వసంత్, తాక్సాండే దివాకర్, గులే మోహన్, మునేశ్వర్ విఠల్, గులే ఆనంద్, సోనజోకే లాను, తాక్సాండే రాహుల్, టంటే మనోహర్, తదితరులు పాల్గొన్నారు. .

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

నేరడిగొండ(బోథ్): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు బోథ్ మండల కేంద్రంతో పాటు మర్లపల్లి, ధన్నూర్(బి) గ్రామాల్లో మంగళవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఎన్నికల్లో ప్రజలందరు ప్రశాంతమైన వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని సీఐ రమేశ్ సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. సీఆర్‌పీఎఫ్ బలగాలతో ఆయా గ్రామాల్లోని పలు వీధుల గుండా ఫ్లాగ్‌మార్చ్ చేపట్టారు. కార్యక్రమంలో ఎస్సై రాము, పోలీసులు పాల్గొన్నారు.

మధుయాష్కీని పరామర్శించిన గండ్రత్ సుజాత



పరామర్శిస్తున్న సుజాత దంపతులు

కైలాస్‌నగర్: పార్లమెంట్ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ తెలంగాణ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్‌ను మంగళవారం గండ్రత్ సుజాత ఆశన్న దంపతులు పరామర్శించారు. ఇటీవల ఆయన మాతృమూర్తి అనసూయ మరణించిన విషయాన్ని తెలుసుకుని హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మధుయాష్కీ గౌడ్‌ను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న స్కూల్ యాజమాన్యం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన సంజయ్ సట్లవార్ కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నాడు. ఆదిలాబాద్ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి గండ్రత్ సంతోష్ జిల్లా కేంద్రంలోని కాన్వెంట్ స్కూల్ యాజమాన్యానికి విషయం తెలియజేయడంతో వారు స్పందించి మంగళవారం బాధితుడికి రూ.25వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మేరియా రోజ్, మేనేజర్ లిజెంటో, తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ అభ్యర్థిని గెలిపించాలి'



గిరిగాంలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

తాంసి: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గోడం నగేష్‌కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సామ సంతోష్ రెడ్డి కోరారు. మంగళవారం అట్నంగూడ, గిరిగాం, లీంగూడ గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పొచ్చన్న, గంగారాం, చంద్రకిరణ్, సురేష్, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయక్షేత్రం పరిశీలన

ఇచ్చోడ: మండలంలోని నవేగావ్‌లో గాయక్‌వాడ్ రామేశ్వర్ వ్యవసాయక్షేత్రాన్ని హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రీతం, డాక్టర్ నిఖిల్ మంగళవారం పరిశీలించారు. రామేశ్వర్ కొంతకాలంగా ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండిస్తున్నాడు. గ్రామాన్ని సందర్శించిన అధికారులు రైతును అడిగి పంటల వివరాలు తెలుసుకున్నారు.

రోడ్డు భద్రత నియమాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఆర్టీసీ అధికారులు

ఎదులాపురం: పట్టణంలోని కలెక్టర్ చౌరస్తాలో గల బస్‌స్టాప్‌లో మంగళవారం ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో ప్రయాణికులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఆర్టీసీ గమ్యం యాప్, వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రైవేటు వాహనాలను ఆశ్రయించకుండా ఆర్టీసీలో ప్రయాణించాలని, మహాలక్ష్మి స్కీంను సద్వినియోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌డీఐ ఎస్‌కే యూసుఫ్, విలేజ్ బస్ ఆఫీసర్ సతీశ్, ప్రయాణికులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించండి'



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

నేరడిగొండ(బోథ్): కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి కోరారు. మంగళవారం బోథ్‌లో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, ఎంపీటీసీ సభ్యులు షేక్ నాజర్ అహ్మద్, జి.గంగాధర్, భోజన్న, షేక్ అబుద్, మల్యాల అంజయ్య, రహీముద్దీన్, సురేందర్, కురుమే గంగయ్య, పడిగల భోజన్న, తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ గణేశ్‌రెడ్డి

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకుందాం

తలమడుగు: ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం కోసాయిలోని హనుమాన్ ఆలయంలో పూజలు చేసి ప్రచారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు ప్రకాష్‌రావు, బాబన్న, ఎంపీటీసీలు వెంకన్న యాదవ్, సోమన్న, మాధవ్, బాబూఖాన్, మాజీ సర్పంచులు విట్టల్, రఘు, గంగారాం , ప్రతాప్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు అశోక్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు రఫీక్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాముని శోభాయాత్ర ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌టౌన్: శ్రీరామనవమి సందర్భంగా శ్రీరామ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న భారీ శోభాయాత్ర ఏర్పాట్లను ఎమ్మెల్యే పాయల్ శంకర్ మంగళవారం పరిశీలించారు. శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠం వద్ద సిద్ధమవుతున్న విగ్రహ పనులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రామ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని పోలీసులను కోరారు. శ్రీరామ ఉత్సవ సమితి నాయకులు రాళ్లబండి మహేందర్, సాయి, మహేందర్, జోగు రవి, ఆకుల ప్రవీణ్, సురేందర్, అర్జున్, నాగేందర్ గౌడ్, నిఖిల్, శివగౌడ్, గోపి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అనిల్ ఇంటి వద్ద కేటీఆర్ సందడి



కేటీఆర్‌తో అనిల్ జాదవ్, కుటుంబ సభ్యులు

నేరడిగొండ: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదిలాబాద్‌లో కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని తిరుగు ప్రయాణంలో నేరడిగొండ మండల కేంద్రంలోని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నివాసంలో ఆగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించారు. అనంతరం కేటీఆర్ వారితో కలిసి భోజనం చేశారు. ఆయా గ్రామాల నుంచి వచ్చిన వారందరితో సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు.

ఆకట్టుకున్న ఫైర్ విన్యాసాలు

ఆదిలాబాద్‌టౌన్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్‌లో ఫైర్ సిబ్బంది విన్యాసాలు చేపట్టారు. నీటితో ఆకాశంలో చేసిన విన్యాసాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి కేశవులు మాట్లాడుతూ అగ్నిప్రమాదాలపై ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. 1944లో ముంబాయ్‌లోని విక్టోరియా డాక్ యార్డ్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో 66 మంది అగ్నిమాపక సిబ్బంది మృతి చెందినట్లు గుర్తు చేశారు. వారి జ్ఞాపకార్థం ఏటా అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఫైర్ అధికారి గోవర్ధన్‌రెడ్డి, స్టేషన్ ఫైర్ అధికారి శివాజీ, సిబ్బంది రహీం, మోహన్, రాజశేఖర్, అవినాష్ యజ్‌దాని, తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు

ఇచ్చోడ: మండలంలోని దాబా(బి)లో పశువైద్యాధికారి గోవింద్‌నాయక్ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. అవకాశాన్ని పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సిబ్బంది దేవ్‌రావు, శేక్‌రావు పాల్గొన్నారు.